http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 28 జనవరి 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## రాజ్యాంగాన్ని మార్చాడానికి

# మోదీ ప్రయత్నం

- బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ
- "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీతో కలిసి మనం ఈ పోరాటం చేస్తున్నాం
- ఇది ఎన్నికల ర్యాలీ కాదు.. ఇది ఒక యుద్ధం
- ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు
- రాహుల్ గాంధీ ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నారు



ఇండోర్

మధ్యప్రదేశ్ లోని ఇండోర్ లో జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీ తో కలిసి మనం ఈ పోరాటం చేస్తున్నాం. ఇది ఎన్నికల ర్యాలీ కాదు? ఇది ఒక యుద్ధం. ఈ యుద్ధం రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడేవారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవారికి మధ్య జరుగుతోంది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నారు. గజనీ మహమ్మద్ హిందుస్తాన్ ను దోచుకోవడానికి ప్రయత్నించినట్లు, రాజ్యాంగాన్ని మార్చాలని మోదీ ప్రయత్నిస్తున్నారు.కానీ ఆయన ప్రయత్నం ఫలించడంలేదు.జ ఎందుకంటే ఆనాడు బ్రిటిషర్ల నుంచి మహాత్మా గాంధీ దేశాన్ని రక్షించినట్లు. భారతీయ జనతాపార్టీ పేరుతో చలామణి అవుతున్న బ్రిటిష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ గాంధీ నిలబడ్డారు. ఈ పయుద్ధంలో మనమంతా రాహుల్ గాంధీతో కలిసి నడవాలి. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మనమంతా కలిసికట్టుగా పోరాడాలని అన్నారు. - మిగతా3లో



## వాటి జోలికి వస్తే..

# జాగ్రత్త

- మీ పథకాలకు ఏ పేరైనా పెట్టుకోండి..
- కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదు
- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుంది
- సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం
- 6 గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్

కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే - మిగతా3లో

## ఈ సిపాయిలు తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి..

# మనకు అజీర్తి అయిందట

- నీవు పెట్టబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషపడుతాం
- రూ. లక్షా 78 వేల కోట్లు అని బిల్డప్ ఇచ్చుడు కాదు.. 2024లో ఇట్లనే చెప్పారు..
- రేవంత్ ఏడాది పాలనలో 12 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు : కేటీఆర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్

ఈ సిపాయిలు తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి మనకు అజీర్తి అయిందట.. మనం ఈనో తాగాలట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెసోళ్లు పెట్టిన హోర్డింగ్‌లను చూసి ఏడ్వాలో.. నవ్వాలో అర్థం కావడం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం కేటీఆర్ ప్రసంగించారు. రేవంత్ రెడ్డి నువ్వు తెలంగాణ ఉద్యమంలో - మిగతా3లో



## ప్రధాని మోదీకి పేద ప్రజల కంటే 'వారే' ముఖ్యం

- లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- అదానీ, అంబానీ లాంటి వాళ్లకు దేశ సంపదను దోచి పెడుతోన్నారు
- రాజ్యాంగం లేకుంటే దేశంలో ఎవరు మిగలరు
- రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను మోదీ ప్రభుత్వం అవమానిస్తోంది

# ఖాతాల్లో రైతుభరోసా

- రైతుభరోసా డబ్బుల జమ కొనసాగుతోందన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- తొలివిడతలో మండలానికో గ్రామంలో సొమ్ము విడుదల చేశామని వెల్లడించిన మంత్రి
- రాష్ట్రంలో 4,41,911 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 593 కోట్ల రూపాయలు జమ
- అర్హులైన ప్రతిరైతుకూ రైతుభరోసా జమచేస్తాం
- వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా నిధుల జమకూడా కొనసాగుతుంది



హైదరాబాద్

అర్హులైన రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులను జమ చేసే ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలివిడతలో భాగంగా మండలానికొక గ్రామంలో రైతుభరోసా సొమ్మును విడుదల చేసినట్లుగా వివరించారు. రాష్ట్రంలో 4,41,911 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేడు 593 కోట్ల రూపాయలు జమ అయ్యాయని తుమ్మల వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జనవరి 26న రైతుభరోసా పథకం ప్రారంభమైందని తెలిపారు. సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ. 6000 చొప్పున అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తామన్నారు. రైతు భరోసా పథకం నిధులు జిల్లాలో ప్రతి మండలానికి ఒక్కో గ్రామం చొప్పున మొదట విడుదల చేయడం జరిగిందని మంత్రి తుమ్మల వెల్లడించారు. విడుదల చేసిన నిధులు ఈ రోజు రైతుల అకౌంట్లలో జమ చేసినట్లుగా ఆయన వివరించారు. రైతు భరోసా నిధుల విడుదల రెవెన్యూ గ్రామాల వారీగా జరుగుతుంది కనుక కొన్ని జిల్లాలలో మండలానికి ఒకటి కంటే ఎక్కువ - మిగతా3లో

## వక్ఫ్ సవరణల బిల్లుకు జేపీసీ ఆమోదం

- ఎన్డీయే ప్రతిపాదించిన 14 సవరణలకు ఆమోదం
- విపక్షాలు సూచించిన మార్పులకు తిరస్కరణ
- "మొత్తం 44 సవరణలు చర్చకు వచ్చాయి
- సభ్యులందరిని సవరణలు సూచించాల్సిందిగా కోరాం
- 6 నెలలపాటు సమగ్ర చర్చ జరిపాం
- జేపీసీ కమిటీ ఛైర్మన్ జగదాంబికా పాల్ ఆ వివరాలు వెల్లడి



## బిజెపి అధ్యక్షుడిగా ఈటల రాజేందర్!

- ఈటెల రాజేందర్‌కు రాష్ట్ర బీజేపీ పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట..
- బీసీ ముఖ్యమంత్రి నినాదం కలిసి రాకపోయినా ఆ వర్గాన్ని ఓన్ చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది
- తాజాగా కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఈటల నియామకం దాదాపు కన్ఫామ్ అయినట్లే

హైదరాబాద్

తెలంగాణలలో బీజేపీ బీసీ మంత్రాన్నే నమ్ముకుంది గత ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి నినాదం కలిసి రాకపోయినా ఆ వర్గాన్ని ఓన్ చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. అందులో భాగంగా ఈటెల రాజేందర్‌కు రాష్ట్ర బీజేపీ పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట.. ప్రస్తుతం ప్రెసిడెంట్ పదవి కోసం పోటీ పడుతున్న వారితో పోలిస్తే ఈటల బెటర్ అని కాషాయ పెద్దలుభావిస్తున్నారంట. అధ్యక్షుడు కావడానికి ఆర్ఎస్ ఎస్ బ్యాక్ గ్రౌండ్ - మిగతా3లో



# ప్రధాని మోదీకి పేద ప్రజల కంటే 'వారే' ముఖ్యం

**భోపాల్, జనవరి 27:** ప్రధాని నరేంద్ర మోదీకి పేద ప్రజల కంటే బడా బాబులే ముఖ్యమని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు దేశ సంపదను దోచి పెడుతోన్నారంటూ ప్రధాని మోదీపై ఆయన మండిపడ్డారు. రాజ్యాంగం లేకుంటే దేశంలో ఎవరు మిగలరని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను మోదీ ప్రభుత్వం అవమానిస్తోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బీఆర్ అంబేద్కర్ జన్మస్థలమైన మధ్యప్రదేశ్‌లోని మోవ్ వేదికగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు.



ఈ సందర్భంగా మోదీ పాలనలో అంబేద్కర్‌కు జరుగుతోన్న అవమానాన్ని ఆయన వివరించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేతోపాటు వయనాడ్ ఎంపీ ప్రియాంక వాద్రా తదితర అగ్రనేతలు హాజరయ్యారు. అలాగే వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఆ పార్టీ ముఖ్య నేతలు సైతం ఈ ర్యాలీకి విచ్చేశారు. దాదాపు 2 లక్షల మంది పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ర్యాలీ గురించి మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతు పట్వారీ మాట్లాడుతూ.. ప్రజల హక్కులు.. మరి ముఖ్యంగా 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను కాపాడటంతోపాటు రాజ్యాంగాన్ని రక్షించడమే లక్ష్యంగా చేసుకొని ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని నిరంతరం ఆయన ప్రజల మధ్యకు తీసుకు వెళ్తారన్నారు. మరోవైపు స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడం.. రాజ్యాంగాన్ని బలహీన పరుస్తోందంటూ బీజేపీపై కాంగ్రెస్ పార్టీ నేతలు తరచూ ఆరోపిస్తున్నారు. అలాగే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను సైతం బీజేపీ నేతలు అవమానిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రజల మధ్యకు బలంగా తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ క్రమంలో గ్రామాలు, మండలాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించి.. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా చొచ్చుకు వెళ్లేలా ఆ పార్టీ అడుగులు వేస్తోంది. ఇంకోవైపు నిన్న అంటే.. జనవరి 26వ తేదీ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్.. బీఆర్ అంబేద్కర్ జన్మించిన మోవ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని పరోక్షంగా విమర్శించారు. కొంత మందికి బీఆర్ అంబేద్కర్ జన్మస్థలం మోవ్ పర్యాటక ప్రాంతమైందంటూ ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఇక మోవ్‌లో రాహుల్ గాంధీ ప్రసంగించే ర్యాలీలో రాజకీయ ప్రసంగాలపై స్థానిక జిల్లా యంత్రాంగం ఆంక్షలు విధించింది. దీనిపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడుతోన్నాయి. ఇది అప్రజాస్వామికమని ఆ పార్టీ నేతలు అభివర్ణిస్తున్నారు.

## మహా కుంభమేళా సందర్భంగా గంగా నదిలో

# మునిగితే పేదరికం తొలగిపోతుందా?

**భోపాల్:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా సందర్భంగా బీజేపీ నేతలు పవిత్ర స్నానాలు ఆచరించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా విమర్శించారు. వారు గంగా నదిలో మునిగితే దేశంలో పేదరికం తొలిగిపోతుందా? ఆకలితో ఉన్నవారి కడుపులు నిండుతాయా? అని ప్రశ్నించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో జరిగిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధన్' సభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. 'నేను ఎవరి విశ్వాసాన్ని ప్రశ్నించాలనుకోవడం లేదు. ఎవరైనా తప్పుగా భావిస్తే నేను క్షమాపణలు కోరుతున్నా. అయితే నాకు చెప్పండి. ఒక పిల్లవాడు ఆకలితో చనిపోతున్నప్పుడు, స్కూల్‌కు వెళ్లనప్పుడు, కార్మికులకు వారి బకాయిలు అందనప్పుడు, అటువంటి సమయంలో ఈ వ్యక్తులు (బీజేపీ నేతలు) వేల రూపాయలు



ఖర్చు చేసి (గంగా నదిలో) మునగడానికి పోటీ పడుతున్నారు. ఫొటోల్లో బాగా కనిపించే వరకు వారి స్నానాలు కొనసాగుతాయి' అని విమర్శించారు. కాగా, ఇలాంటి వ్యక్తులు దేశానికి మేలు చేయలేరని మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. 'దేవుడిపై మాకు విశ్వాసం ఉంది. ప్రజలు ప్రతిరోజూ ఇంట్లో పూజలు చేస్తారు. అందరు మహిళలు పూజ తర్వాత తమ ఇళ్ల నుంచి బయటకు వస్తారు. ఎటువంటి సమస్య లేదు. కానీ మతం పేరుతో పేదలు దోపిడీకి గురవుతున్నారన్నది మా సమస్య' అని అన్నారు. అయితే ఖర్గేకు ముందు మాట్లాడిన రాహుల్ గాంధీ కూడా బీజేపీపై మండిపడ్డారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ, అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వేషంతో కోట్లాది మంది హిందువుల విశ్వాసంపై దాడి చేస్తున్నదని ఆరోపించారు. మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరే ఇతర మత విశ్వాసం గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా? అని తాను సవాల్ చేస్తున్నానని అన్నారు.

# రాజకీయాల్లోకి నిశాంత్

**పాట్నా :** బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. నితీష్ కుమార్ తన కుమారుడు నిశాంత్ కుమార్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. హోలీ తర్వాత ఆయన అధికారికంగా రాజకీయాల్లోకి వస్తారని.. ఆ మేరకు ముహూర్తం నిర్ణయించినట్లు బీహార్ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోందినిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి రావడాన్ని బీజేపీకి చెందిన మంత్రి ప్రేమ్ కుమార్ స్వాగతించారు. నిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి వస్తే స్వాగతిస్తానని అన్నారు. ఇది ప్రజాస్వామ్యమని, రాజకీయాల్లోకి వచ్చే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. నిశాంత్ కుమార్ నవ యువకుడు.. ఆయన రాక బీహార్ అభివృద్ధికి ఊపునిస్తుందన్నారు. ఆయన రాజకీయ రంగ ప్రవేశాన్ని స్వాగతిస్తానని చెప్పారు.బీహార్ సీఎం నితీష్ కుమార్, ఆయన ధివంగత భార్య మంజు సింగ్‌ల ఏకైక కుమారుడు నిశాంత్ కుమార్. ఆయన వయసు 38 ఏళ్లు. ప్రస్తుతం ఆయన రాజకీయాలు, టీవీ డిబేట్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వస్తున్నారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ డిగ్రీ చదివారు.జనవరి 8న, నిశాంత్ కుమార్ తన స్వస్థలమైన భక్తియార్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో



తన తండ్రితో కలిసి కనిపించాడు. ఆ సమయంలో, ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మరోసారి ఏఆజ, తన తండ్రికి ఓటు వేయాలని కోరారు. తద్వారా రాష్ట్రంలో మళ్లీ తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భక్తియార్‌పూర్‌లో జరిగిన కార్యక్రమం తర్వాత, నిశాంత్ కుమార్ రాజకీయాల్లోకి రావచ్చుని జేడీయూ సీనియర్ నాయకుడు, బీహార్ మంత్రి శ్రవణ్ కుమార్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై నిశాంత్‌కుమార్‌కు పూర్తి అవగాహన ఉందని, ఆయన ప్రగతిశీల యువకుడని చెప్పారు. ఆయనలాంటి ఆలోచనలు ఉన్న యువత రాజకీయాల్లోకి రావాలని అన్నారు. అదే సమయంలో.. నిశాంత్ కుమార్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని జేడీయు పార్టీ కార్యకర్తలు చాలా కాలం నుంచి కోరుతున్నారు.దీనికి ముందు, నిశాంత్ కుమార్ చివరిసారిగా 2015లో తన తండ్రి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. అప్పట్లో ఆయన రాజకీయాల్లోకి వచ్చే యోచన లేదని స్పష్టంచేశారు. తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని, ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని ఎంచుకున్నట్లు తెలిపాఅయితే ఇప్పుడు నిశాంత్ కుమార్ రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధమయ్యిందన్న ఊహాగానాలు బీహార్ రాజకీయాల్లో జోరుగా సాగుతున్నాయి. వచ్చే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తారని ప్రచారం జరుగుతోంది. నిశాంత్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని నితీష్ కుమార్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై జేడీయు లేదా నితీష్ కుమార్ నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.బీహార్ అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్రంలో మొత్తం 243 స్థానాలు ఉండగా.. మరోసారి అక్కడ అధికార పగ్గాలు సొంతం చేసుకోవాలని ఎన్డీయే ఉవ్విళ్లూరుతోంది.


## మహారాష్ట్రలో విజృంభిస్తున్న గుల్లెయిన్ బారే సిండ్రోమ్..!


# పుణేలో వందకుపైగా బాధితులు..!

గుల్లెయిన్ బారే సిండ్రోమ్‌తో మహారాష్ట్రలో తొలి మరణం నమోదైనట్లుగా తెలుస్తున్నది. సోలాపూర్‌లో ఓ వ్యక్తి మరణించగా.. మరణానికి జీబీఎస్ కారణంగా మరణించినట్లుగా ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో సిండ్రోమ్ బారినపడుతున్న రోగుల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉన్నది. పుణేలోనే వంద మందికిపైగా రోగులున్నారు. మృతుడిని సోలాపూర్ నివాసిగా గుర్తించారు. సదరు వ్యక్తి కొద్దిరోజుల కిందట పుణేకు వచ్చాడని.. ఆ సమయంలోనే సిండ్రోమ్ సోకినట్లుగా భావిస్తున్నారు.

**పుణేలో పెరుగుతున్న రోగులు..**

ఇమ్యునోలాజికల్ నరాల వ్యాధి గుల్లెయిన్ బారే సిండ్రోమ్ వ్యాప్తి పుణేలో ఎక్కువగా కనిపిస్తున్నది. ఆదివారం నాటికి సంఖ్య వందకుపైగా దాటింది. పుణేలో జీబీఎస్ సోకిన వారి సంఖ్య 101కి పెరిగింది. ఇందులో 68 మంది పురుషులు, మరో 33 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 16 మంది రోగుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారికి వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నారు. పుణే మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీం, ఆరోగ్యశాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా పూణేలోని సింఘాడ్ రోడ్డులో గరిష్ఠ సంఖ్యలో రోగులను గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా నిఘా వేశారు.





ఇప్పటివరకు, రాష్ట్రంలో 25,578 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 15,761 ఇండ్లు పుణే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. మరో 3,719 నివాసాలు చింఛ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తాయి. 6,098 ఇండ్లు రూరల్ ప్రాంతానికి వస్తాయి.

**జీబీఎస్ అంటే ఏంటీ?**

గుల్లెయిన్ బారే సిండ్రోమ్.. జీబీఎస్ అనేది రోగనిరోధక నాడీ వ్యాధి. వ్యాధి సోకితే చేతులు, కాళ్లు అకస్మాత్తుగా తిమ్మిరి వస్తాయి. కండరాలు బలహీనంగా మారుతాయి. వ్యాధి లక్షణాల్లో బలహీనత.. విరేచనాలు ఉంటాయి. సాధారణంగా జీబీఎస్ సమస్య బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ రోగనిరోధక శక్తిని కూడా బలహీనంగా మారుస్తుంది. పిల్లలు, యువత ఎక్కువగా ఈ వ్యాధి బానిపడుతున్నారు. వ్యాధి బారినపడ్డ వారంతా కోలుకుంటుండడం విశేషం. తాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. ఆహారం సైతం శుభ్రంగా ఉంచుకోవాలని.. కూరగాయాలను శుభ్రంగా కడుక్కోవాలని.. బాగా ఉడికించి తినాలని వైద్యశాఖ అధికారులు సూచించారు.

## వక్ఫ్ సవరణల బిల్లుకు జేపీసీ ఆమోదం




**న్యూఢిల్లీ:** వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలనకు ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ పలు సవరణలతో బిల్లుకు సోమవారంనాడు ఆమోదం తెలిపింది. భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని ఎన్డీయే ప్రతిపాదించిన 14 సవరణలకు ఆమోదం లభించగా, విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యారు. జేపీసీ సమావేశానంతరం కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ ఆ వివరాలను వెల్లడించారు. "మొత్తం 44 సవరణలు చర్చకు వచ్చాయి. సభ్యులందరిని సవరణలు సూచించాల్సిందిగా కోరాం. 6 నెలలపాటు సమగ్ర చర్చ జరిపాం. ఇదే మా చివరి సమావేశం. మెజారిటీ నిర్ణయం ప్రాతిపదికగా 14 సవరణలను కమిటీ ఆమోదించింది. విపక్షాలు సైతం సవరణలు సూచించాయి. ప్రతి సవరణను ఓటింగ్‌కు పెట్టాం. అయితే వారు సూచించిన సవరణలను సమర్థిస్తూ 10 ఓట్లు, వ్యతిరేకిస్తూ 16 ఓట్లు వచ్చాయి" అని జగదాంబిక పాల్ తెలిపారు.

**విపక్షాలు అసంతృప్తి**

కాగా, కమిటీలో ఎన్డీయే సూచించిన మార్పులకు ఆమోదం లభించడం, తాము సూచించిన మార్పులు తిరస్కరణకు గురికావడంపై ప్రతిపక్ష ఎంపీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటింగ్ జరగలేదని అన్నారు. తమ వాదనలు వినలేదని, నియంతృత్వ ధోరణిలో జగదాంబికా పాల్ వ్యవహరించారని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆరోపించారు. "మేము ఏదైతే ఊహించామో ఇవాళ అదే జరిగింది. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించ లేదు. నిబంధలు, విధివిధానాలను పాటించలేదు. సవరణలపై క్లాజ్ బై క్లాజ్ చర్చించాలని మేము కోరినప్పటికీ మమ్మల్ని మాట్లాడనీయలేదు. ఇది ప్రజాస్వామ్యానికి దుర్దినం" అని బెనర్జీ అన్నారు. అయితే బెనర్జీ ఆరోపణలను పాల్ తోసిపుచ్చారు. మొత్తం ప్రక్రియ అంతా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందని, మెజారిటీ అభిప్రాయలను కమిటీ ఆమోదించిందని చెప్పారు. వక్ఫ్ చట్టం-1995లో పలు మార్పులు తీసుకు వస్తూ కేంద్రం గత ఆగస్టులో బిల్లు తీసుకువచ్చింది. అనంతరం బిల్లు పరిశీలనను 21 మంది సభ్యులతో కూడిన జేపీసీకి అప్పగించింది.

## పాలపుంతలా కంభమేళా..

## స్పేస్ స్టేషన్ నుంచి ఫోటో తీసిన ఆస్ట్రోనాట్



**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ్‌లో పవిత్ర స్నానాలు చేసేందుకు కోట్లాది జనం వెళ్తున్నారు. ఆ త్రివేణి సంగమ ప్రదేశం ఇప్పుడు రాత్రిపూట దీపకాంతులతో వెలిగిపోతున్నది. కోట్లాది జనాల్ని ఆకర్షిస్తున్న ఆ కుంభమేళా.. ఆకాశం నుంచి కూడా అద్భుతంగా కనిపిస్తోంది. ఆ సనాతన సంప్రదాయ సమ్మేళనాన్ని.. నాసాకు చెందిన ఆస్ట్రోనాట్ తన కెమెరాలో బంధించారు. ఆస్ట్రోనాట్ డాన్ పెటిట్ కుంభమేళాకు చెందిన ఫోటోను రిలీజ్ చేశారు. రాత్రి పూట త్రివేణి సంగమ ప్రదేశం.. లైట్ల వెలుతురులో ఓ నక్షత్ర కూటమిలా కనిపిస్తున్నది. ఆస్ట్రోఫోటోగ్రఫీకి పెటిట్ చాలా ఫేమస్. గంగానది ఒడ్డున జరుగుతున్న కుంభమేళా ఫోటో ఇదే అని, ప్రపంచంలో ఒకే చోట హాజరైన అతిపెద్ద మానవ సమాహారం అని ఆ ఫోటోకు క్యాప్షన్ ఇచ్చాడతను. గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భ్రమిస్తున్న అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ఫోటోను తీశారు. హైపవర్డ్ కెమెరాల ద్వారా ఈ అద్భుతాన్ని బంధించారు. ఆ ఫోటోపై ఇంటర్నెట్ యూజర్లు కూడా స్పందిస్తున్నారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయంటూ కామెంట్ చేస్తున్నారు.

## ప్రయాగ్ రాజ్ నీటితో

## ఇంట్లో చేయవచ్చా

**అలహాబాద్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవాల్లో మహా కుంభమేళా ఒకటి. నేటి నుంచి మహా కుంభమేళా ప్రారంభం అయ్యింది. ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా జరగనుంది. దీన్ని ఘనంగా ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లోనిర్వహిస్తున్నారు. ఈ మహా కుంభమేళాకి లక్షలాది భక్తులు వెళ్తుంటారు. పవిత్ర నదులు అయిన గంగా, యమునా, సరస్వతి మూడు నదుల సంగమంలో స్నానం చేయడానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. మొత్తం నాలుగు ప్రదేశాల్లో ఈ మహా కుంభమేళాజరుగుతుంది. అలహాబాద్ ప్రయాగ్‌రాజ్ , హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌ల జరుగుతుంది. ఎంతో అంగరంగ వైభవంగా జరిగే ఈ మహా కుంభమేళాను 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. వివిధ దేశాల నుంచి కూడా ఈ కుంభమేళాకు భక్తులు వెళ్తుంటారు. అయితే కొందరికి ఈ కుంభమేళాకు వెళ్లడానికి వీలు కుదరదు. వ్యక్తిగత సమస్యలు, దూరం వంటి కారణాల వల్ల చాలా మంది కుంభమేళాలో స్నానం చేయలేరు. దీంతో పుణ్యం రాదేమో అని బాధపడుతుంటారు. అయితే మీరు మహా కుంభమేళాకు వెళ్లకపోయిన కూడా స్నానం చేసే ప్రతిఫలం పొందాలంటే మాత్రం కొన్ని నియమాలు పాటించాలని పండితులు చెబుతున్నారు.మహా కుంభమేళాకు వెళ్లడానికి అందరికి కూడా వీలుపడదు. అలాంటి వారు ఎవరైతే వెళ్తారో వారిని నీరు తీసుకురమ్మని చెప్పండి. వారు తీసుకొచ్చిన నీటిలో మీరు కాస్త నీరు కలిపి ఆ నీటితో స్నానం చేయండి. కనీసం చుక్క నీరు అయిన కూడా మీకు పుణ్యం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. మీరు తెలిసిన వారు కూడా ఎవరూ కుంభమేళాకు వెళ్లడం లేదు అనుకుంటే.. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఇక్కడి నీరు, ప్రసాదాలు పంపుతాయి. వాటిలో మీరు మీ డిటైల్స్ అన్ని కూడా నమోదు చేసుకుంటే మీకు తప్పకుండా అన్ని వస్తాయి. ఇలా చేయడం వల్ల కూడా మీకు పుణ్యం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ పవిత్ర స్నానం చేయడానికి ఎందరో భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్తుంటారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ మహా కుంభమేళాకి తప్పకుండా వెళ్లాలని చాలా మంది ప్లాన్ చేసుకుంటారు.ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో ఎక్కువగా పవిత్ర స్నానాలు చేస్తారు. ఇక్కడ స్నానం చేయడం వల్ల పాపాలు అన్ని కూడా తొలగిపోతాయని నమ్ముతారు. అయితే ఈ త్రివేణి సంగమం నుంచి నీరు ఇంటికి తీసుకొచ్చి చల్లితే ఇంట్లో ఉన్న గ్రహ, వాస్తు దోషాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. త్రివేణి ఘాట్ నుంచి తీసుకొచ్చిన నీటిని స్నానం చేసే వాటర్‌లో కలపడం వల్ల మానసిక సమస్యలు అన్ని కూడా క్లియర్ అయి ప్రశాంతంగా ఉంటారు. ఈ మహా కుంభమేళా నీటిలో స్నానం మాత్రమే ఆచరించకుండా.. ఇంటికి తీసుకొచ్చి చల్లితే పాపాలు అన్ని కూడా తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు.

http://www.agnidharanews.com అగ్నిధార

# వాటి జోలికి వస్తే.. జాగ్రత్త

-మొదటిపేజీ తరువాయి

నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు.

### ఇంత దుర్మార్గమా?

"మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ధి చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ధి చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా,



రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు.

### గద్దర్‌కు ఎట్లా ఇస్తారు..

పద్మ అవార్డులపై కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు ఏ ప్రాతిపదికన పద్మశ్రీ ఇవ్వాలంటూ ఆగ్రహంతో ప్రశ్నించారాయన. గద్దర్ భావజాలం ఏంటో అందరికీ తెలుసన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసుల్ని హత్య చేయించారని.. మర్డర్ చేయించినవారికి అనుకూలంగా పాటలు పాడారు.. వందల మంది బీజేపీ కార్యకర్తలను మర్డర్ చేయించారంటూ ఆరోపణలు చేశారు బండి సంజయ్. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లు మార్చితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా.. కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందిని వెల్లడించారు. పరిస్థితి అంతవరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ మేం అన్యాయం చేయబోమనని పేర్కొన్నారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా.. గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా మాకు అభ్యంతరం లేదంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని తెలిపారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే.. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే.. అని స్పష్టం చేశారు.6 గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని కామెంట్స్ చేశారు. మండలానికి ఒక గ్రామంలోనే 4 పథకాలకు ఎంపిక చేసి లబ్ధి చేయడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల జేబుల నుండి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్.. బంగ్లాదేశ్ నుండి తెచ్చి ఖర్చు చేస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే.. కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా అని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా? అంటూ ఫైర్ అయ్యారు.

# రాజ్యాంగాన్ని మార్చాడానికి మోదీ ప్రయత్నం

-మొదటిపేజీ తరువాయి

ఇది రెండు పరివార్ ల మధ్య జరుగుతున్నయుద్ధం. ఒకటి గాంధీ పరివార్ మరొకటి గాడ్సే పరివార్. గాడ్సే పరివార్ వైపు నుంచి మోదీ గాంధీ పరివార్ వైపు నుంచి రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. అందుకే మనమంతా గాంధీ పరివార్ గా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలి . రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని అన్నారు.

### బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ

బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదని, బ్రిటిష్ జనతా పార్టీ అంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బీజేపీని ఉద్దేశించి సీఎం సంచలన కామెంట్స్ చేశారు. ముందుగా ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ర్యాలీలో పాల్గొని సీఎం మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ గాంధీతో కలిసి మనం ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఇది ఒక యుద్ధమంటూ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఈ



యుద్ధం రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడేవారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునేవారికి మధ్య జరుగుతోందన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నారన్నారు. ఘజనీ మహమ్మద్ హిందుస్తాన్ ను దోచుకోవడానికి ప్రయత్నించిన తరహాలో, రాజ్యాంగాన్ని మార్చాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ ఆయన ప్రయత్నం ఫలించడంలేదని ఎద్దేవా చేశారు.ఆనాడు బ్రిటిషర్ల నుంచి మహాత్మా గాంధీ దేశాన్ని రక్షించినట్లు, భారతీయ జనతాపార్టీ పేరుతో చలామని అవుతున్న బ్రిటిష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిలబడ్డారని సీఎం తెలిపారు. ఈ యుద్ధంలో మనమంతా రాహుల్ గాంధీతో కలసి నడవాలని, ప్రధానంగా యువతీ యువకులు ముందడుగు వేయాలని సూచించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మనమంతా కలిసికట్టుగా పోరాడాలని, ఇది రెండు పరివార్ ల మధ్య జరుగుతున్నయుద్ధం అంటూ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు.ఒకటి గాంధీ పరివార్.. మరొకటి గాడ్సే పరివార్ అన్న సీఎం, గాడ్సే పరివార్ వైపు నుంచి మోదీ, గాంధీ పరివార్ వైపు నుంచి రాహుల్ గాంధీ పోరాటం సాగిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకే మనమంతా గాంధీ పరివార్ గా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలని, రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని సీఎం కోరారు.

# ఖాతాల్లో రైతుభరోసా

-మొదటిపేజీ తరువాయి

గ్రామాల సంఖ్య కనపడుతుందని తుమ్మల స్పష్టం చేశారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా నిధుల జమకూడా కొనసాగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అర్హులైన ప్రతిరైతుకు రైతుభరోసా నిధులను జమచేస్తామని ఆయన స్పష్టం చేశారు. సాగుయోగ్యం కాని భూముల గుర్తింపు సర్వేకొనసాగుతుందని ఆయన వివరించారు. మార్చి 31లోపు లబ్ధిదారులందరికీ నిధుల జమ పూర్తిచేస్తామని తెలిపారు.

### రైతు భరోసా నిధులు ఏ జిల్లాకు ఎంత విడుదలయ్యాయంటే :

ఆదిలాబాద్ జిల్లాలో 17 మండలాల్లోని 21 గ్రామాలకు చెందిన 6,411 మంది రైతుల బ్యాంకు భాగాల్లో రూ.14.49 కోట్లు జమ అయ్యాయి.

భద్రాద్రి కొత్తగూడం జిల్లాలో 23 మండలాల్లోని 25 గ్రామాలకు చెందిన 22,242 రైతులకు రూ. 39.07 కోట్లు జమ అయ్యాయి.

హన్మకొండ జిల్లాలో 12 మండలాల్లో 12 గ్రామాలకు చెందిన 12,545 రైతులకు రూ. 14.30 కోట్లు జమ అయ్యాయి.

జగిత్యాల జిల్లాలో 20 మండలాల్లో 20 గ్రామాలకు చెందిన 22,242 రైతులకు రూ. 39.07 కోట్లు జమ అయ్యాయి.

జనగామ జిల్లాలో 12 మండలాల్లోని 12 గ్రామాలకు చెందిన 12,320 రైతులకు రూ. 15.91 కోట్లు జమ అయ్యాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాల్లోని 12 గ్రామాలకు చెందిన 7,073 రైతులకు రూ.8.67 కోట్లు జమ అయ్యాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలో 13 మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన 7,829 రైతులకు రూ. 12.47 కోట్లు జమ అయ్యాయి.

కామారెడ్డి జిల్లాలో 22 మండలాలోని 24 గ్రామాలకు చెందిన 9,062 రైతులకు రూ.8.35 కోట్లు జమ అయ్యాయి.

కరీంనగర్ జిల్లాలో 15 మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 14,226 రైతులకు రూ.15.96 కోట్లు జమ అయ్యాయి.



ఖమ్మం జిల్లాలో 21 మండలాల్లోని 21 గ్రామాలకు చెందిన 20,802 రైతులకు రూ.28.42 కోట్లు జమ అయ్యాయి.

కోమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాల్లోని 19 గ్రామాలకు చెందిన 4,344 రైతులకు రూ.8.62 కోట్లు జమ అయ్యాయి.

మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాల్లోని 19 గ్రామాలకు చెందిన 14,611 రైతులకు రూ.18.14 కోట్లు జమ అయ్యాయి.

మహబూబ్ నగర్ జిల్లాలో 16 మండలాల్లోని 16 గ్రామాలకు చెందిన 14,575 రైతులకు రూ. 17.27 కోట్లు జమ అయ్యాయి.

### జిల్లాల వారిగా విడుదలైన రైతుభరోసా నిధులు :

మంచిర్యాల జిల్లాలో 16 మండలాల్లోని 17 గ్రామాలకు చెందిన 7,143 రైతులకు రూ.8.72 కోట్లు జమ అయ్యాయి.

మెదక్ జిల్లాలో 21 మండలాల్లోని 21 గ్రామాలకు చెందిన 14,833 రైతులకు రూ. 14.06 కోట్లు జమ అయ్యాయి.

మేడ్చల్ జిల్లాలో 5 మండలాల్లోని 5 గ్రామాలకు చెందిన 2,706 రైతులకు రూ.3.14 కోట్లు జమ అయ్యాయి.

ములుగు జిల్లాలో 9 మండలాల్లోని 9 గ్రామాలకు చెందిన 6,678 రైతులకు రూ.8.26 కోట్లు జమ అయ్యాయి.

నాగర్ కర్నూల్ జిల్లాలో 20 మండలాల్లోని 20 గ్రామాలకు చెందిన 16,806 రైతులకు రూ. 23.05 కోట్లు జమ అయ్యాయి.

నల్గొండ జిల్లాలో 31 మండలాల్లోని 31 గ్రామాలకు చెందిన 35,568 రైతులకు రూ.46.93 కోట్లు జమ అయ్యాయి.

నారాయణపేట జిల్లాలో 13 మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన 9,348 రైతులకు రూ. 13.87 కోట్లు అయ్యాయి.

నిర్మల్ జిల్లాలో 18 మండలాల్లో 18 గ్రామాలకు చెందిన 7,912 రైతులకు రూ. 10.56 కోట్లు జమ అయ్యాయి.

నిజామాబాద్ జిల్లాలో 31 మండలాల్లోని 31 గ్రామాలకు చెందిన 35,568 రైతులకు రూ.46.93 కోట్లు జమ అయ్యాయి.

పెద్దపల్లి జిల్లాలో 13 మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన 9,885 రైతులకు రూ. 10.14 కోట్లు జమ అయ్యాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాల్లోని 12 గ్రామాలకు చెందిన 9,724 రైతులకు రూ. 12.26 కోట్లు జమ అయ్యాయి.

రంగారెడ్డి జిల్లాలో 21 మండలాల్లోని 21 గ్రామాలకు చెందిన 15,597 రైతులకు రూ.20.32 కోట్లు జమ అయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో 25 మండలాల్లోని 25 గ్రామాలకు చెందిన 19,933 రైతులకు రూ. 24.15 కోట్లు జమ చేశారు.

సిద్దిపేట జిల్లాలో 26 మండలాల్లోని 26 గ్రామాలకు చెందిన 31,170 రైతులకు రూ. 36.76 కోట్లు జమ అయ్యాయి.

సూర్యాపేట జిల్లాలో 23 మండలాల్లోని 23 గ్రామాలకు చెందిన 29,352 రైతులకు రూ. 37.84 కోట్లు జమ అయ్యాయి.

వికారాబాద్ జిల్లాలో 20 మండలాల్లోని 20 గ్రామాలకు చెందిన 8,609 రైతులకు రూ.11.18 కోట్లు జమ అయ్యాయి.

వనపర్తి జిల్లాలో 15 మండలాల్లోని 15 గ్రామాలకు చెందిన 9,441 రైతులకు రూ.12.25 కోట్లు జమ అయ్యాయి.

వరంగల్ జిల్లాలో 11 మండలాల్లోని 11 గ్రామాలకు చెందిన 11,386 రైతులకు రూ. 12.86 కోట్లు జమ అయ్యాయి.

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాల్లోని 17 గ్రామాలకు చెందిన 17,576 రైతులకు 26.95 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

## తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా ఈటల రాజేందర్!

-మొదటిపేజీ తరువాయి

అవసరం లేదంటూ తాజాగా కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఈటల నియామకం దాదాపు కన్ఫామ్ అయినట్లే అంటున్నారు. తెలంగాణ కాషాయ రథ సారథిగా మల్కాజ్‌గిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఎంపిక దాదాపు ఖరారైదంట. ఈ నెలాఖరు లోపే దాని పై అధికారిక ప్రకటన, ఈటెల పగ్గాలు చేపట్టడం ఖాయమంటు న్నారు.పార్టీ సంస్థాగత ఎన్నికలు దాదాపు పూర్తవుతున్న క్రమంలో కీలకమైన రాష్ట్ర అధ్యక్ష పదవి ఖరారుపై జాతీయపార్టీ దృష్టి సారిం చింది. ఈటల సారథ్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారంట.

## ఈ సిపాయిలు తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి.. మనకు అజీర్తి అయిందట

-మొదటిపేజీ తరువాయి

ఉల్టా ఉన్నావు.. తుపాకీ పట్టుకుని విద్యార్థుల మీదకు గురిపెట్టావు. ఉద్యమంలో కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు తేడా ఏందంటే.. 9 నెలల పాటు ఒక తల్లి బిడ్డను ఎలా మోస్తదో.. పురిటినొప్పులు పడుతూ ఒక బిడ్డకు ఎలా జన్మనిస్తదో.. అలానే టీఆర్ఎస్ కూడా కేసులు ఎదుర్కొని, దెబ్బలు తిని, ఎదురుదెబ్బలు తిని, అవమానాలకు గురై 14 ఏండ్లు పాటు తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి.. చావు నోట్లో తలపెట్టి.. తల్లి పాత్ర పోషించి, పురిటినొప్పులు పడి తెలంగాణ అనే బిడ్డకు జన్మనిచ్చిన పాత్ర టీఆర్ఎస్‌ది. తెలంగాణ ఉద్యమంలో నీ కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏంది.. ఉంటే గింటే ఆ మంత్రసాని పాత్ర పోషించింది అని కేటీఆర్ తెలిపారు. నీవు పెట్టబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషపడుతాం. రూ. లక్షా 78 వేల కోట్లు అని బిల్డప్ ఇచ్చుడు కాదు.. 2024లో ఇట్లనే చెప్పారు.. రూ. 42 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. కానీ ఇవాళ ప్రజలు మీ మీద అనుమాన పడుతున్నారు. నేతి బీరకాయలో ఎంత నెయ్యి ఉంటదో.. కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో కూడా వాస్తవం అంతే ఉంటది అని. 42 వేల కోట్ల పెట్టబడులు అని చెప్పినా.. ఇప్పటికీ ఒక్కటి కూడా రాలేదు.. కాబట్టి నిన్ను ఎవరు నమ్ముతలేరు. ప్రభుత్వ, ప్రజల పైసలతో హోర్డింగ్స్ పెడుతున్నవ్.. మా బొమ్మలు ఎందుకు.. చేతనైతే నీ బొమ్మ పెట్టుకో. రేవంత్ రెడ్డి చేతనైతే ఎప్పుడు పెట్టుబడులు వస్తాయో చెప్పు.. మా పిల్లలకు ఉద్యోగాలు ఎప్పుడు వస్తాయో చెప్పు. మా కంటే ఎక్కువ చేసి చూపెడితే మీకు సన్మానం కూడా చేస్తాను అని కేటీఆర్ పేర్కొన్నారు. నిన్న కొడంగల్‌లో ఒకటే స్పీచ్‌లో రెండు మాటలు మాట్లాడిండు.. తెల్లారే వరకు అందరికి రైతు భరోసా పైసలు పడుతవి అని చెప్పిండు.. 15 నిమిషాల్లో మాట మార్చిండు.. రేవంత్ రెడ్డిని చూస్తే డౌటస్తుంది.. అపరిచితుడు సినిమాలో రాము, రెమోలా ఉన్నాడు. అందరికీ తెల్లారే వరకు డబ్బులు పడుతవి అని అన్నాడు.. పది నిమిషాల్లోనే మాట మార్చి 31 వరకు అన్నాడు. ఏడాది మళ్లీ చెప్పలేదు. కాబట్టి వీరి మాటలకు గ్యారెంటీ లేదు. మార్చి 31 డెడ్‌లైన్ ఎందుకు పెట్టిండో తెలుసా.. ఓట్ల కోసం. 12786 గ్రామపంచాయతీలు ఉంటే 612 గ్రామాల్లోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తడంట అని కేటీఆర్ పేర్కొన్నారు.

### రేవంత్ ఏడాది పాలనలో 12 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న రేవంత్ రెడ్డి హామీ నీటి మీద రాతలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన తర్వాత కూడా 12 వేల ఉద్యోగాలు దాటలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రాహుల్ గాంధీ అశోక్‌నగర్ వెళ్లి.. గ్రూప్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదని దుష్ప్రచారం చేసి.. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వాగ్దానం చేశారు. కానీ ఇవాల్టికి ఒక కొత్త నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇక కేసీఆర్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వలేదని అంటున్నారు. 2 లక్షల 32 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 1,60,283 ఉద్యోగాలను భర్తీ చేశాం. కానీ ఇవ్వనేలేదు అని కాంగ్రెసోళ్లు ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏడాదికి 16 వేల ఉద్యోగాల చొప్పున భర్తీ చేశాం. కానీ ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యాం. పేపర్లు లీక్ అయ్యాయని అభ్యర్థులను రెచ్చగొట్టి మనకు దూరం చేశారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ చెప్పారు. ఏడాది పూర్తయినా తర్వాత కూడా 12 వేల ఉద్యోగాలు దాటలేదు. మనం వేసిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి తామే ఇచ్చినట్టు ఫోజులు కొట్టుకుంటున్నారు. అందుకే ఈ విషయాలను సోషల్ మీడియా, కాలేజీ, స్కూల్ సభల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. మెడికల్, రెసిడెన్షియల్, నర్సింగ్ కాలేజీల గురించి చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఉన్న అవకాశం కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉంది. ఇతర రాష్ట్రాలకు ఈ వెసులుబాటు లేదు. ఓపెన్ కేటగిరిలో కూడా మనం కొట్లాడొచ్చు. రాష్ట్రపతిని ఒప్పించి, మెప్పించి కేసీఆర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు.

### రేవంత్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని.. గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇద్దాం

కాంగ్రెస్ పార్టీ అనేక అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. అబద్దాలతో పాలన కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి ప్రసాదించాలని జనవరి 30వ తేదీన మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు ఇద్దామని బీఆర్ఎస్వీ నేతలకు, విద్యార్థులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం కేటీఆర్ మాట్లాడారు. జనవరి 30వ తేదీన మహాత్మా గాంధీ వర్ధంతి.. బాపును తలచుకుంటూ.. కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ ఒరిజినల్ గాంధీ.. ఈ డూప్లికేట్ గాంధీలకు బుద్ధి తెచ్చేలా ఒక ప్రోగ్రామ్ తీసుకుందాం. జనవరి 30 నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు అవుతుంది కాబట్టి.. 420 హామీలపై ప్రశ్నిద్దాం. గాంధీ విగ్రహం వద్దకు వెళ్లి వినతపత్రం ఇస్తూ.. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ కలలోకి వచ్చి.. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేట్టు ఆదేశాలు ఇవ్వండంటూ వినతిపత్రం ఇద్దాం. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో రైతుల ఆత్మహత్యలపై ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో పర్యటించి.. ఆ రైతుల కుటుంబాల్లో భరోసా నింపింది. ఆదిలాబాద్‌లో బ్యాంకులోనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ 420 రోజుల్లో 410 మంది రైతులు చనిపోయారు. గురుకులాల్లో పెద్ద ఎత్తున పిల్లలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. హయత్‌నగర్‌లో మైనార్టీ గురుకులంలో ఇవాళ ఓ విద్యార్థిని చనిపోయింది. మెట్‌పల్లిలో ఆరుగురు విద్యార్థులకు పాము కరిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. గురుకుల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పి.. బీఆర్ఎస్వీ నేతృత్వంలో గురుకులాల బాట కార్యక్రమం చేపడితే.. ప్రభుత్వం కళ్లు తెరిచింది. మంత్రులు, కలెక్టర్లు గురుకులాల్లో పర్యటించారు. రెండు రోజులు మంత్రులు డ్రామాలు ఆడి.. మళ్లీ గురుకులా వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 మంది పైచిలుకు నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. వీరందరని ఆదుకోండి.. ఇకనైనా మొద్దునిద్ర వీడండి అని ప్రభుత్వానికి సూచించాం. 420 హామీల మోసాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఫిబ్రవరి 9 నుంచి ఆర్టీసీ సమ్మె..! ఎండీ సజ్జనార్‌కు నోటీసులు

**హైదరాబాద్ :** తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, రెండు పీఆర్సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ. 2,700 కోట్ల చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఫిబ్రవరి 9వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నప్పటికీ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని సంఘాల నేతలు మండిపడ్డారు. ఇలానే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వానికి తమ తడాఖా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. ఐదేండ్ల తర్వాత సమ్మె చేయడం ఇదే తొలిసారి అని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రయివేటుపరం చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# సంపాదకీయం

## అరుణోదయం వైపు అడుగులు

అభివృద్ధి చెందిన దేశమైన ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో వామపక్ష గ్రూపు అతిపెద్ద సమూహంగా ఎన్నికైంది. భారతదేశం చుట్టూ కొత్తగాలి వీస్తోంది. బంగ్లాదేశ్‌లో ప్రజావ్యతిరేక పాలకులను ప్రజలు దేశం నుంచే తరిమేశారు. ఉద్యమాలతో అట్టుడికిన శ్రీలంక ఎర్రజెండాకు పట్టం కట్టింది. దశాబ్దకాలానికి పైగా నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం నడుస్తున్నది. దక్షిణ అమెరికా పరిణామాలు తెలిసినవే. అంతర్జాతీయ వాణిజ్యంలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉన్న అమెరికాను దాటి చైనా మొదటి స్థానంలో నిలిచింది. ఈ గాలుల ప్రభావం భారత దేశం మీద పడకుండా ఉంటుందా? అనే ఆందోళన పాలకవర్గాల్లో మొదలైంది. అందుకేనేమో ప్రశ్నించే ప్రజల ఆందోళనల పట్ల అసహనం ప్రదర్శిస్తున్నారు. పదకొండేండ్లుగా కేంద్రంలో బీజేపీ పాలన చూస్తున్నారు జనం. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూసిన ప్రజలు ఏడాదిగా మరోసారి గమనిస్తున్నారు. తొమ్మిదిన్నరేండ్లు బీఆర్ఎస్ పాలనను రుచి చూశారు. జెండాల రంగులు, పార్టీల పేర్లు వేరైనా విధానాలొక్కటే కదా! తెలుగురాష్ట్రాల్లో ఎర్రజెండా వారసత్వం ఇంకా ప్రజలు మరచిపోలేదు. తొలి అసెంబ్లీ ఎన్నికల్లోనే అటు ఆంధ్ర ప్రాంతం లోగానీ, ఇటు తెలంగాణ అసెంబ్లీలో గానీ కమ్యూనిస్టులకు గణనీయమైన సంఖ్యలో పట్టంగట్టారు. అటు జాతీయోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర, ఇటు తెలంగాణలో దొరల పాలనకు, రాచరికానికి వ్యతిరేకంగా రైతాంగ తిరుగుబాటు ఇందుకు పునాదులు వేసింది. ఈ పోరాటాల్లో ఇరువైపులా సరిహద్దు జిల్లాల ప్రజల పరస్పర సహకారం చరిత్రలో మరవలేనిది. పాలకవర్గాలు కూడా ఇది మర్చిపోరు కదా. అందుకే వారి మదిలో ఏదో ఒక మూల ఆందోళన వెన్నాడుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలోనే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జరగబోతున్నాయి. గత అర్ధ శతాబ్ద కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో గానీ, ప్రస్తుత తెలంగాణలో గానీ ఆర్థిక, సామాజిక, రాజకీయ మార్పులు అనేకం జరిగాయి. పెట్టుబడిదారీ విధానం బలపడింది. వ్యాపార ధోరణులు విస్తరించాయి. సరళీకృత ఆర్థిక విధానాలు వీటిని మరింత వేగవంతం చేశాయి. ఫలితంగా సమాజంలో విలువల వలువలూడుతున్నాయి. వీటి ప్రభావం అన్ని రంగాలను ఆవహిస్తున్నది. కమ్యూనిస్టేతర పార్టీల ప్రభావాలు, పార్లమెంటరీ భ్రమలు ఎర్రజెండా శ్రేణుల మీద కూడా ఎంతోకొంత ప్రభావం చూపుతున్నాయి. అందుకే కమ్యూనిస్టు శ్రేణులు పోరాటాల్లో అగ్రభాగాన ఉన్నప్పటికీ రాజకీయ క్షేత్రంలో బలహీనపడ్డారు. ఎన్నికల్లో ఉన్నత లక్ష్యాల కోసం కమ్యూనిస్టులు కృషి చేసినప్పటికీ వారితో కలిసి పోటీ చేసిన ఇతర పార్టీలకు మాత్రం చిత్తశుద్ధి లేదు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వామపక్షాల ప్రతిష్టను వాడుకోవడమే తప్ప పొత్తుధర్మం పాటించలేదు. ఇది వారి సహజ వర్గనైజం. వామపక్షాల బాధ్యతాయుత ఎత్తుగడలు, ఇతర పార్టీల బాధ్యతా రహిత కుయు క్తుల మధ్య ప్రజల్లో కొంత గందరగోళం నెలకొన్నది. ఆమేరకు వామపక్షాలకు నష్టం కూడా జరిగింది. సరళీకృత విధానాల నేపథ్యంలో ఓటు, సీటు, పదవి అన్నీ సరుకులుగా మారాయి. అవినీతి అన్ని రంగాలను ఆవహించింది. పార్టీ ఫిరాయింపులకు గౌరవస్థానం దక్కింది. వామపక్ష శ్రేణులకు ఈ పరిణామాలు కొత్త సవాలును విసురుతున్నాయి. ఎర్రజెండా పోరుబాట, సుందరయ్య స్ఫూర్తి వామపక్ష శ్రేణులకు కొత్త దారులు చూపుతున్నాయి. కేంద్రంలో మోడీ సర్కార్ గానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ గానీ, నిన్నటిదాకా పాలించిన బీఆర్ఎస్ గానీ అవకాశవాదంతో పోటీపడుతున్నారు. ఏడాది కాలంగా లిక్కర్ కేసు, కాళేశ్వరం, ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా ఇ-రేస్‌ల పేరుతో ఆరోపణలు, ప్రత్యారోపణలే తప్ప ప్రజాసమస్యలు వీరికి పట్టవు. మూసీప్రక్షాళన, హైడ్రా సమస్యలూ అంతే. వికారాబాద్‌లో రాడార్ ఏర్పాటు విషయంలో ఈ మూడు పార్టీలదీ ఒకే దారి. పర్యావరణానికి ప్రమాదం లేని ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్న వామపక్షాలు, పర్యావరణవేత్తల సూచనలను ఈ మూడు పార్టీలూ ఖాతరు చేయలేదు. ప్రజా సమస్యలు వీరెవరికీ పట్టవు. వీరిమూలాలు ఒక్కటే కావటమే ఇందుకు కారణం. కంపెనీల్లో వీరికి నచ్చని మాట కనీస వేతనాలు. యజమానులకు ఇష్టం ఉండదు కదా. వ్యవసాయ కార్మికులు, కౌలురైతుల మాటలంటేనే వీరికి గిట్టదు. అసైన్డ్ భూములు వీరికి ఇష్టమైన భోజనం. వీరి దృష్టిలో కార్మిక చట్టాలు, శ్రామికుల హక్కులు అభివృద్ధికి ఆటంకాలు. సింగరేణి బొగ్గుబ్లాకులు, ఆర్టీసీలో విద్యుత్తు బస్సులు పెట్టుబడిదారులకు నైవేద్యం పెట్టగల ఇష్టమైన భక్తులు వీరు. పెట్టుబడి పాదాల దగ్గర పూజారి ఎవరన్నదే వీరి తగాదా. రాజకీయరంగంలో ఇది కుర్చీల కొట్లాట. బడాబాబుల ప్రయోజనాలకు అంకితమైన ఈ పార్టీలు ఓట్లకోసం మాత్రం పేదలను మభ్యపెడుతున్నాయి. ఈ ప్రయత్నాల నుంచే ఓట్ల పథకాలు ఆవిర్భవి స్తున్నాయి. సంక్షేమ జపంలో పోటీ పడుతున్నాయి. పెరుగుతున్న ధరలు, మారుతున్న జీవితా వసరాలతో సరిపడని ఆదాయం జనాల్ని సతమతం చేస్తున్నా యి. సంక్షేమ పథకాల పేరుతో విసిరిన ఓట్ల పథకాలు పేదలకు కొంత ఊరటనిస్తున్నాయి. అందుకే ఆకర్షితులవుతున్నారు. ఈ బలహీనతే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లాంటి పార్టీలకు బలం చేకూర్చుతున్నది. తక్షణం ఊరటనిచ్చే పథకాలను వెదజల్లి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే వాగ్దానాలకు మాత్రం వీరు మొండిచేయి చూపుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు మూడెకరాల భూమి, కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య, ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ, పోడు భూములపై హక్కులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు లాంటి వాగ్దానాలు అటకెక్కాయి. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఆరు గ్యారంటీలలో మౌలికమైన వాగ్దానాలన్నీ మరుగున పడుతున్నాయి. ఖాళీ పోస్టుల భర్తీలు, ఇండ్లస్థలాలు, సాగుభూములు, కౌలురైతులు వంటి మాటలు పాలకుల నోట రావడంలేదు. బీఆర్ఎస్ పాలనలో పాలకులను అహంభావం ఆవరించింది. హక్కులంటే ఆగ్రహం కలిగించింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ తన ఏడవ గ్యారంటీగా చెప్పుకున్న కాంగ్రెస్ పాలకులు బీఆర్ఎస్ చెప్పుల్లోనే అడుగులు పెట్టారు. రాజదండం తెచ్చి పార్లమెంటులో పెట్టిన కేంద్ర పాలకులకు రాచరికాలంటే ముద్దు. ప్రజాస్వామ్యం వారి దృష్టిలో పెనుముప్పు. హక్కులడిగినవారంతా వారి భాషలో దేశద్రోహులు. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలన్న తేడాలేదు. కేంద్ర ప్రభుత్వమా, రాష్ట్ర ప్రభుత్వమా అన్న వ్యత్యాసం లేదు. పెట్టుబడిదారులు, ఫామ్‌హౌస్ యజ మానుల పట్ల ప్రేమ, ప్రజల హక్కుల పట్ల అసహనం ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు అండగా నిలుస్తున్న వామపక్షాల పట్ల చిర్రుబుర్రులాడుతున్నారు. జనంలో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారులు పట్టించేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు. ఇందులో బీజేపీది అందెవేసిన చెయ్యి. ఎన్నికలకు ముందు రజాకార్, కాశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ పేర్లతో సినిమాల ద్వారా ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొట్టారు. రాముడిని, రామాలయాన్ని రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకున్నారు. మెజారిటీ మతస్తులను ఓటు బ్యాంకుగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. తర్వాత కూడా సమ్మక్క సారలమ్మ జాతర, జైనూరు, ఉట్నూరు ఘటనలు, సికింద్రాబాద్ ఉప్పుగూడ సంఘటనలను కూడా ఇందుకోసమే వాడుకునేందుకు ప్రయత్నించారు. బక్రీద్ పండుగ రోజున మైనారిటీల మీద దాడులకు తెగబడ్డారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గానీ, బీఆర్ఎస్ నాయకత్వం గానీ బీజేపీ కుయుక్తులను ఖండించలేదు. లౌకిక విలువల కోసం ప్రజలను సమాయత్తం చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం శాంతి భద్రతల సమస్యగా మాత్రమే పరిగణించింది. ఒకవైపు బీజేపీ, ఎంఐఎం లాంటి పార్టీలు మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మాత్రం అవకాశ వాదం ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి కీలకమైన సందర్భాల్లో లౌకిక విలువల కోసం, ప్రజాస్వామ్యం కోసం నికరంగా నిలబడ్డది కేవలం వామపక్షాలే. ప్రజా సమస్యల పరి ష్కారం కోసం నిరంతరం పోరుబాటలో ఉన్నది ఎర్ర జెండా. ప్రజలను సమీకరిం చి ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నది కమ్యూనిస్టులు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచుతున్నారు. విద్యా, వైద్యం వ్యాపారమయం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ధరాభారం నుంచి ప్రజలను కాపాడేందుకు మార్గం చూపుతున్నారు. వ్యవసాయ సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట మార్గాలు పాలకుల ముందుంచుతున్నారు.

## జాతీయోద్యమంలో లాలాజీ పాత్ర



లాలా లజపతిరాయ్ జీవితం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి. ఆనాటి భారతీయులను ఎందరినో ఆయన భావాలు, త్యాగాలు ప్రభావితం చేశాయి. ఆయన పిలుపు దేశ ప్రజల గుండెలలో మారుమోగి, లక్షలాది మంది భారతీయులు స్వాతంత్ర్య ఉద్యమంలోకి దిగి, ఆ మహా యజ్ఞంలో సమిధలు కావడానికి ప్రేరణ కలిగించింది. కోట్లాది ప్రజలకు ఆరాధ్య దేవునిగా లాలాజీ పూజలు అందుకున్నా రనడంలో అతిశయోక్తి లేదు. 'నేను మరణించవచ్చు, కాని నానుండి వెలువడే ప్రతి నెత్తురు చుక్క నుండి లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులు ఉద్భవిస్తారు' అని ప్రకటించారు. లాలా మాట నిజం అయింది. అయన మరణానంతరం స్వాతంత్ర్యోద్యమం మరింతగా విస్తృతం అవుతుందని తెలిసిన భవిష్యత్ దర్శకుని జీవితం భారతీయులకు స్ఫూర్తిదాయకం. స్వదేశీ ఉద్యమం, ఆర్య సమాజాన్ని, అతివాద రాజకీయాలను సమన్వయ పరచిన భారత జాతీయ అగ్ర నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరు. ఒకే భావాలు కలిగిన స్వాతంత్ర్య సమర యోధులైన లాలా లజపత్ రాయ్, బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్ర పాల్ లను "లాల్ బాల్ పాల్" అని పిలిచే వారు. లాలా లజపత్ రాయ్ (జనవరి 28, 1865 – నవంబరు17, 1928) పంజాబ్ రాష్ట్రం మోఘా జిల్లా ధుడీకె గ్రామంలో జన్మించారు. భారత స్వతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరులలో ఒకరిగా చిరస్థాయిగా నిలిచి పోయారు. ఆయన "పంజాబ్ కేసరి" బితుదాంచితులు అయినారు. అయన పంజాబ్ నేషనల్ బ్యాంకు, మరియు లక్ష్మి ఇన్సూరెన్స్ కంపెనీల స్థాపకుడు. లాహోర్‌లో న్యాయవిద్య అభ్యసిస్తున్నప్పుడు స్వాతంత్ర్యోద్య మం వైపు దృష్టి సారించారు. అదే సమయంలో స్వామి దయానంద సరస్వతి భావాలవైపు మొగ్గు చూపారు. 1877లో లాగోర్ ఆర్యసమాజ్ సభ్యుడిగా ఉంటూనే ఆర్య గెజిట్‌కు సంపాదకత్వం వహించారు. 1888, 1889 లలో జరిగిన జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలలో ఆయన ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆ తర్వాత 1892లో హైకోర్టులో న్యాయవాదిగా లాహోర్ కు వెళ్లారు. 1885వ సంవత్సరంలో ఒక ప్రభుత్వ కళాశాల నుండి రెండవ తరగతి న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణులై హిస్సార్ లో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. ఆ తర్వాత 1892లో లాహోర్ కు మకాం మార్చారు. భారత జాతీయ కాంగ్రెస్ లోని ప్రముఖ నాయకులలో లాలా లజపతిరాయ్ ఒకరిగా గుర్తింపు పొందారు. 'స్వేచ్ఛ అనేది అభ్యర్థించడం నుంచి రాదు, కానీ అది పోరాడాలి' అనే బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్‌ల అభిప్రాయాలతో ఆయన ఏకీభవించారు. అలా భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించి 1920లో కలకత్తాలో జరిగిన ప్రత్యేక సమావేశానికి అధ్యక్షులుగా ఎన్నికైనారు. 1921లో "సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటి" పేరుతో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. జాతీయోద్యమంలో "పంజాబ్ కేసరి"గా పేరు పొందారు. "ఆర్య సమాజం నా తల్లి, వైదిక ధర్మం నా తండ్రి" అంటుండే వారు ఆయన. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో లాలా కూడా పాల్గొన్నారని, ఆయనతో పాటు సురేంద్ర నాథ్ బెనర్జీ, బిపిన్ చంద్ర పాల్, అరవింద్ ఘోష్ లతో కలిసి బెంగాల్ తదితర ప్రాంతాల్లో ప్రజలను ఏకం చేసి స్వదేశీ ఉద్యమాన్ని ఉధృతం చేశారని చరిత్ర చేపుతున్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఆయన తన పూర్తి శక్తిని వినియోగించారు. చివరికి న్యాయవాద వృత్తిని కూడా వదులు కున్నారు. సైమన్ కమిషన్ లో భారతీయ ప్రతినిధి ఎవరూ లేని అంశం భారతీయుల ఆగ్రహానికి ఆజ్యం పోయగా, ఆ తర్వాత దేశ వ్యాప్తంగా నిరసనలు మొదలైన నేపథ్యంలో లాలా లజపతిరాయ్ నిరసనలో ముందున్నారు. పోలీసు సూపరింటిండెంట్ జేమ్స్ ఎ. స్కాట్ కవాతును ఆపడానికి లాఠీచార్జి చేయాలని ఆదేశించారు. జేమ్స్ స్కాట్ బ్రిటిష్ పోలీసు ఉన్నతాధికారి విచక్షణ రహితంగా కసిగా, ఆవేశంగా లాఠీ దెబ్బలతో ఛాతీపై కొట్టాడు. 'ఇవాళ నా గుండెల మీద పడిన లాఠీ దెబ్బలు బ్రిటిష్ సామ్రాజ్య శవపేటికకి చివరిగా కొట్టిన మేకులవుతాయి.' అని ఆ సందర్భంగా లజపతి రాయ్ అన్న మాటలు. "అమాయక పౌరుల మీద దాడులకు దిగే ప్రభుత్వానికి నాగరిక ప్రభుత్వమని చెప్పుకునే హక్కు లేదు. అలాంటి ప్రభుత్వాలు ఎక్కువ కాలం కొనసాగలేవు!' అంటూ గర్జింపుతో స్వాతంత్ర్య పోరాట చరిత్రలో పంజాబ్ సింహమంటూ కీర్తి పొందిన లాలా లజపతిరాయ్ ఒక సందర్భంలో అన్నమాటలివి. ఆ మాటలు ఆయన కన్నుమూసిన రెండు దశాబ్దాలకు నిజమైనాయి. ఈ సంఘటనలో లజపతి రాయ్ తీవ్రంగా గాయపడి 1928 నవంబర్ 17న గుండె పోటుతో మరణించారు.

## దళిత సాహిత్యోద్యమ రథసారథి



పత్రికా పాఠకులకు సుపరిచితులు డాక్టర్ ఎండ్లూరి సుధాకర్. జీవితాంతం నిజాయితీ బాట లోనే నడిచారు. నిబద్ధతకు మారుపేరు గా నిలిచారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం సుధాకర్ కే సొంతం. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 న నిజామాబాద్ లోని పాముల బస్తీలో తన అమ్మమ్మ గారి ఇంట్లో జన్మించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జ్యూరీ సభ్యులు, తెలుగు సలహా మండలి సభ్య లు, తెలుగు అకాడమీ సభ్య లు, ప్రసిద్ధ హిందీ, ఉర్దూ పద్యాల, లఘు చిత్రాల అనువాదకులు. హైదరాబాద్ విశ్వ విద్యా లయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జనవరి 21, 1959 లో నిజామాబాద్ లోని పాముల బస్తీలో దేవయ్య, శాంతా బాయిలకు ప్రథమ సంతానంగా జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం .ఏ . ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పిహెచ్ .డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యా లయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు. 1990 అక్టోబరు 6 వ తేది నుంచి వివిధ పదవుల్ని నిర్వ హించారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహి త్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించారు. జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసంగించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి...వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, తదితర రచనలు గావించి, తెలుగు సాహితీ క్షేత్రంలో తమదైన స్థానాన్ని పదిల పరచు కొన్నారు. నేటికి ఆయనను అనుకరిస్తూ, అనుసరిస్తూ ఆయన బాటలో పయనిస్తున్న వారు ఎందరో కవులు ఉన్నారంటే ఆయన ప్రభావం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాటి కవుల పట్ల సహృదయతే తప్ప అసూయ ఎరగని వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా అతి సామాన్య జీవితం గడపడం లాంటి ప్రత్యేకతలు ఆయనకే చెందుతాయని ఆయన తో పరిచయమున్న వారు చెపుతా రు. గుర్రం జాషువా అనంతరం అంతటి విశాల హృదయం, భావుకత లాంటి బహుముఖీన ప్రజ్ఞ సుధాకర్ లోనే కనబడుతుంది అంటే అతిశయోక్తి కాదు. దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సహ దర్మచారిణి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, వారి కూతురు ఎండ్లూరి మానస కథా రచయిత్రి, ఆమె రాసిన కథా సంపుటి "మిళి%శీ%ద" కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించడం విశేషం. లలిత కళా పరిషత్ పురస్కారం, నల్గొండ, స్లిష్టల వెంకటల్లు దీక్షితులు స్మారక సాంస్కృతిక సాహితీ కళా సమితి , యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్, కవికోకిల జాషువా, తిలక్ అవార్డు, బెంగళూరు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, సమతా రచయితల పురస్కారం అమలాపురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్ , సినారె పురస్కారం - కరీంనగర్ , నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, అద్దంకి, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి ఎన్ రెడ్డి మెమోరియల్ అవార్డు, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, లెక్క లేనన్ని అందు కున్నారు. 28 జనవరి 2022 (శు క్రవారం) తెల్లవారు జామున హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు. 63వ పుట్టిన రోజు తర్వాత వారం రోజుల కే ఈ లోకాన్ని వదిలి వెళతారని ఎవరూ హిస్తారు. సుధాకర్ ఆకస్మిక అకాల మరణం ఆధునిక తెలుగు సాహిత్యానికి తీరని లోటు.

## బాల గేయ సాహిత్య ఆద్యులు

బాల సాహిత్య రచయితల్లో ప్రథముడిగా, ప్రముఖుడిగా భావిం చ బడతారు గిడుగు వెంకట సీతాపతి. 1800 సంవత్సరానికి పూర్వం బాల సాహిత్యమనేది ఎక్కువగా కనిపించేది కాదు. ఉన్నా అది లిఖితం కానిదే. జానపద సాహిత్యంలో అంతర్భాగమై ఉండేది. 1819లో పిల్లల కోసం విక్రమార్కుని కథలు పుస్తకం అచ్చయ్యింది. ఆనాటి నుంచి బాలసాహిత్యం ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన సాహిత్యంగా వచ్చింది. 20వ శతాబ్ది ప్రారంభంలో అధునిక తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రి యలు ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావ కారణంగా పరిణమించినట్లే బాలసాహిత్య ప్రక్రియ కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల వచ్చింది. పిల్లలు చదివి అర్థం చేసుకో గల సాహిత్యం ఈ వికాస దశలోనే వెలువడింది. బాల సాహిత్యంతో గిడుగు వెంకట సీతాపతికి విడదీయ రాని సంబంధం ఉంది. సీతాపతి 1885వ సంవత్సరం జనవరి28 వ తేదీన విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం తెలుగు వ్యావ హారిక భాషోద్యమసారథి అయిన గిడుగు వెంకటరామ మూర్తి దంప తులకు జన్మించారు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో చరిత్రలో పట్ట భద్రులై కొంతకాలం పర్లాకిమిడిలో చరిత్ర ఉపన్యాసకులుగా పని చేశారు. వ్యావహారిక భాషోద్యమం లోను, సవర భాషోద్ధరణ లోను తండ్రికి కుడిభుజంగా నిలిచి విశేషా నుభవం గడించారు. రైతుబిడ్డ, స్వర్గసీమ, పల్నాటి యుద్ధం, భక్తిమాల వంటి కొన్ని చలన చిత్రాల్లోను మరియు కొన్ని నాటకా ల్లోను నటించారు. మాగంటి బాపినీడు సంపాదకత్వంలో వెలు వడిన ఆంధ్ర సర్వస్వానికి అనేక వ్యాసాలు రాశారు. తెలుగులో భాషాసమితి ఏర్పడినప్పుడు తెలుగు విజ్ఞాన సర్వస్వానికి ప్రధాన సంపాదకుడిగా నియమితు లయ్యారు. చరిత్ర - రాజనీతి శాస్త్ర సంపుట సంపాదక వర్గంలో ప్రముఖ పాత్ర పోషించారు. సూర్యరాయాం ధ్ర నిఘంటువు చివరి దశలో ఆయన సంపాదకత్వం వహిం చారు. ఆయన రచనల్లో ముఖ్య మైనవి భారతీ శతకం, సరస్వతీ విలాసం, కొద్దిమొర్ర కువలయావళీ నాటిక మొదలై నవి. బైబిల్ మూడు సువార్తల్ని సవర భాషలోకి అనువదించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి అభ్యర్థనపై తెలుగు సాహిత్య చరిత్రను ఇంగ్లీషులోకి అనువదించారు. " తెలుగులో చంధోరీతులు' అనే గ్రంథానికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి పురస్కా రం లభించింది. ఆయనను ఆంధ్ర విశ్వకళా పరిషత్ కళా ప్రపూర్ణ బిరుదుతో గౌరవించింది. గిడుగు ఇంగ్లీషు రచనల్లోని విశిష్టతను గుర్తించి వాషింగ్టన్‌లోని అంతర్జాతీయ అకాడమీ డి.లిట్ ప్రదానం చేసింది. సీతాపతి రాసిన రచనలన్నీ ఒక ఎత్తు కాగా, బాలల కోసం సృష్టించిన సాహిత్యం మరొక ఎత్తు. ఈయన చిలకమ్మ పెళ్లి, ఎలుకా - పిల్లి, రైలుబండి, ఈగా-సాలీడు మొదలైన రచనలు 1907-1909 మధ్యకాలంలో 'వివేకవతి' పత్రికలో ప్రచురిత మయ్యాయి. ఆనాడు బాలగేయాలకు అసలు ఆదరణే వుండేది కాదు. రాతలు కాకుండా పిల్లలు మెచ్చేవి చిరకాలం మనసు లో నిలిచే కథలు, కబుర్లు తేలిక భాషలో చెప్పాలనేవారు సీతాపతి. తర్వాత 1940 సంవత్సరంలో సీతాపతి "భారతి' సాహిత్య మాస పత్రికకు సంపాదకులై నప్పుడు బాలలకోసం ఉపయుక్త రచనలు చేయమని కవులకు, రచయితలకు ప్రబోధించారు. అలా ప్రేరేపితులైన, నూతనోత్సాహ భరితులైన కవులు, రచయితలు బాలల కోసం రాసిన గేయాల్ని గేయకథల్ని, చిన్న కథల్ని 1955 సంవత్సరంలో 'బాలానందం' అనే అనే శీర్షికతో పుస్తకరూపంలో ముద్రించారు. 1958 సం.లో బాలవినోదం అనే గేయసంపుటాన్ని ప్రచురించారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన బాలసాహిత్య రచనాల యాల్ని నిర్వహించి యువ రచయితలకు శిక్షణ కూడా యిచ్చా రు. ఎందరో, కవులకు రచయిత లకు మార్గ దర్శకులయ్యారు.

# వ్యవసాయ మోటార్ల దొంగలు



**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 27.:** మందమర్రి మండలం లోని సారంగపల్లి, చిర్రకుంట గ్రామాలలో వ్యవసాయ బోర్ల దొంగలు గ్రామాలలో.. సాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే వ్యవసాయ బోర్ల పైనే ఆధారపడి రైతులు సాగు చేస్తుంటారు. రబీ కాలంలో ఉద్యాన పంటలకు బోర్లే ప్రధాన వనరు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 200 నుండి, 300 అడుగుల లోతన ఉంటాయి. ఎంతో కష్టపూరితముతో వీటిని ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ కలెక్షన్ల కోసం లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో రాత్రివేళ బోర్లు, విద్యుత్ తీగలు దొంగలు ఎత్తుకెళ్తున్నారు. ఒకటి రెండు కాదు ఇప్పటివరకు సారంగపల్లి, చిర్రకుంట గ్రామంలో ఆరు బోర్లు పోయినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వరుస చోరీల నేపథ్యంలో.. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. వారి నుంచి సరైన స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటివరకు కేసులో నమోదు చేసుకున్న బోర్లపై ఎలాంటి పురోగతి రాలేదని, వ్యవసాయదారులు ఆందోళనల చెందుతున్నారు. దొంగల పాలైన బోర్ల విలువ మూడు నుండి నాలుగు లక్షల రూ. వరకు ఉంటుంది. రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన పంటకే గిట్టుబాటు ధర లేక, ప్రకృతి విపత్తులతో నష్టానికి గురవుతున్న రైతన్నకు వరుస సంఘటనలు మరింత కొంగదీస్తున్నాయి. లక్షల్లో ఆర్థికంగా నష్టపోవలసి వస్తుంది. లో వోల్టేజ్, సరపరలో లోపాలు ఉండకూడదని వ్యవసాయ బోర్లు అమార్చుకున్న ఇవన్నీ చోరీకి గురవుతున్నాయి. నియోజకవర్గంలో మందమర్రి మండలం సారంగపల్లి, చిర్రకుంట, శంకర్పల్లి, పొన్నారం, గ్రామాలలో వ్యవసాయ భూములు ఉండడంతో దొంగలు రాత్రి వేళలో చోరీలకు ఎంచుకుంటున్నారు. ఈ దొంగల ముఠా చోరీలకు పాల్పడకుండా పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు తమ ఆవేదనని వ్యక్తం చేస్తున్నారు.

# బీరప్ప స్వామికి కమనీయంగా కళ్యాణోత్సవం



**మల్గిలో గ్రామ దేవతలు, దర్గా, చర్చిలో ప్రత్యేక పూజలు**

**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి )"** న్యాల్కల్ మండల్ తెలంగాణ, కర్ణాటక సరిహద్దు, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మండలంలోని మల్గి గ్రామంలో గ్రామ దేవతల జాతరోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈనెల 25న ప్రారంభమైన వేడుకలో భాగంగా ఆదివారం శ్రీ బీరప్ప స్వామికి కళ్యాణోత్సవం, సోమవారం గ్రామ దేవతలు, దర్గాలు, చర్చిలో స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థన చేశారు. బీరప్ప స్వామికి కళ్యాణోత్సవ కార్యక్రమం కనువిందుగా, కమనీయంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి, దేవాలయాల సమూహం నుండి గ్రామ శివారులోని శ్రీ బీరప్ప స్వామి దేవాలయం వరకు బోనాలతో తరలి వెళ్లారు. డప్పు వాయిద్యాలు, ఆట,పాటలు, భజనలతో ఊరేగింపుగా తరలి వెళ్లారు. అనంతరం ఆలయం చుట్టు బోనాలతో ప్రదిక్షణలు చేసి శ్రీ బీరప్ప స్వామిని దర్శించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న మరియమ్మ, ఉరడమ్మ దేవతలకు బోనాల ఊరేగింపు. 29న శ్రీ లింగమయ్య స్వామి, శ్రీ లక్ష్మీ మాతకు బోనాల ఊరేగింపు కార్యక్రమాలను చేపట్టనున్నారు. స్థానిక భక్తులతో పాటు సమీపంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ బీరప్ప స్వామి, గ్రామ దేవతలు, దర్గాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉత్సవ నిర్వాహక భక్తులు జడ్గొండ మారుతి, శివానంద శ్రీపతి, సిద్ధారెడ్డి, భూమారెడ్డి, విట్టల్, రాజు,అజిముద్దిన్, ఇస్మాయిల్, షౌకత్, స్వామి దాస్, సంజీవరెడ్డి, భీమన్న, అర్జున్, ప్రతాపరెడ్డి, జైపాల్ రెడ్డి, నరసింహారెడ్డి,స్వామి దాస్, దత్తు, మారుతి, కృష్ణ, మహేష్,సిద్ధూ నగేష్, సునీల్, రాకేష్, సిద్ధూ, , తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరిస్తాం



**ప్రజావాణికి 67 ఫిర్యాదులు ,కలెక్టర్ సురభి**

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 67 ఫిర్యాదులు వచ్చాయని, వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ఆదేశాలు జారీ చేశామని,వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తెలిపారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు గాగ్వార్, వెంకటేశ్వర్లతో కలిసి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం- సురక్షితంగా గమ్యాన్ని చేరుదాం....



**అగ్ని ధార న్యూస్. మందమర్రి మండలం జనవరి 27. :** బెల్లంపల్లి ఏసిపి రవికుమార్.జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా.. బెల్లంపల్లి ఎసిపి రవికుమార్, మందమర్రి సిఐ. శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బందితో కలిసి సిఈఆర్ క్లబ్ మనమర్రిలో.. ఆటో డ్రైవర్లకు, ప్రైవేట్ పాఠశాలల వ్యాన్ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు,ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.ఈ అవగాహన కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి మంచిర్యాల బృందం వారు పాల్గొని, తమ పాటల ద్వారా వాహనదారులకు అర్థమయ్యే రీతిలో వివరించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి మాట్లాడుతూ...జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు దాటేవారు తప్పకుండా ఒక్క అక్షరం ఆగి చూసి రోడ్డు దాటాలని, మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్ పెట్టుకుని వాహనాలు నడపాలని తెలిపారు. ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబం మొత్తం పై ప్రభావం చూపుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, సూచిం చారు. లాంగ్ డ్రైవ్ చేసే డ్రైవర్లు విశ్రాంతి ప్రదేశాలలో వాహనాలు ఆపుకొని విశ్రాంతి తీసుకుని సమయస్ఫూర్తిగా వాహనాలు నడపాలని తెలిపారు. పెద్ద పెద్ద వాహన డ్రైవర్లు వాహనాలను పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్కు చేయాలని సూచించారు.రాత్రి సమయంలో వాహనాలు పార్కు చేసేటప్పుడు పార్కింగ్ లైట్లు తప్పకుండా వేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాత్రి సమయాలలో రోడ్లపై వాహనాలు నిల పవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మజీద్, పోలీస్ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# పీర్లపల్లి గ్రామం లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా (సిద్దిపేట జిల్లా)**జనవరి 27:జగదేవపూర్ మండలంలో పీర్లపల్లి గ్రామ ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అబ్బీ నర్సిములు జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిలుగా ఎమ్ జే ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామస్వామి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ 30సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేసింది అన్నారు. శ్రీ మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ను స్థాపించిన నుండి మాదిగలకు మాత్రమే కాదు సబ్బండ వర్గాల కోసం పని చేసిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ పోరాటం ద్వారానే అందిన ఫలాలు నేడు అన్ని కులాలు పొందుతున్నాయని తెలిపారు. సబ్బండ వర్గాల ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిన సంఘము అని గుర్తు చేశారు.ఆరోగ్య శ్రీ పథకం రావడం మంద కృష్ణ మాదిగ కృషి అని అన్నారు. ఎ బి సి డి వర్గీకరణ అమలు జరిగితే మాదిగలతో మాదిగ ఉపకులకు న్యాయం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం వర్గీకరణ అవసరమని తెలిపారు. అనంతరం పీర్లపల్లి గ్రామంలో చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు అబ్బి నర్సింలు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మచ్చ గణేష్ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ కరుణాకర్ కార్యదర్శులు మల్లేశం కోశాధికారి బాబు ప్రచారం కార్యదర్శి పైసా స్వామి గోపాల్ పూర్ గ్రామ అధ్యక్షులు మాసపాక కనకయ్య ఇటిక్యాల గ్రామ అధ్యక్షులు కుమార్ గ్రామ నాయకులు సాయిలు కిషన్ నర్సింలు కనకయ్య, గ్రామ పెద్దమనుషు యువకులు పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రటిష్ట బందోబస్తు ఏర్పాటు.

## పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఐపిఎస్.,

**అగ్నిధార న్యూస్,( రామగుండం):** జిల్లా పరిషత్ పాఠశాల జ్యోతి నగర్, ఎన్టిపిసి లో జరిగే ఎన్ టి పి సి నూతన 2400 మెగావాట్ల కొత్త ప్లాంట్ నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం కార్యక్రమం ఉన్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని రామగుండము పోలీస్ కమీషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు.నేటి కార్యక్రమం సందర్భంగా కాజీపల్లి ఆరార్ ఫంక్షన్ హాల్లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి సిపి భద్రతారమైన సూచనలు ఇవ్వడం జరిగింది. మొత్తం 785 మంది పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఏసీపీలు -05, సీఐ లు -25, ఎస్ఐ లు -48, మహిళా ఎస్సై-13, ఏ ఎస్ ఐ / హెడ్ కానిస్టేబుల్ 58, కానిస్టేబుళ్లు-393, మహిళా కానిస్టేబుళ్లు-145, హెూంగార్డ్స్ 62, మహిళా హెూంగార్డు 35 మంది మొత్తం 785 మందితో పోలీసు అధికారులు సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సిపి తెలిపారు. సమావేశం ప్రాంతం, డయాస్, పార్కింగ్ ప్రాంతాల వద్ద ఉండే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి అక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇచ్చారు. పోలీసు బందోబస్తును సెక్టార్లుగా విభజించి డి ఎస్ పి/ఏసీపి లు ఇంచార్జీ లుగా బారి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పికప్ పార్టీ లు, పెట్రోలింగ్ పార్టీలు, ట్రాఫిక్ డైవర్షన్, పికేటింగ్, బిడి టీమ్స్ మొదలగు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్ అధికారులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశలలో అప్రమత్తంగా ఉండి, విధులు నిర్వర్తించే సమయంలో సంయమనం పాటించాలని పక్కాగా విధులు నిర్వర్తించాలని ముఖ్యంగా సమావేశం ప్రాంతంలో సెక్టర్ ల వారిగా ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలి, సమావేశం కు హాజరు అయ్యే ప్రతి ఒక్క అధికారి భద్రత మన బాధ్యత. ప్రతి ఒక్కరి తో మర్యాదగా ప్రవర్తించాలి. ఏదైనా సమస్య సృష్టిస్తే వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన ఐపిఎస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎసిపిలు, సీఐ లు, ఎస్ఐ లు బందోబస్త్ హాజరైన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టు జయన్న కుటుంబసభ్యులకు మాజీ మంత్రిశుభాకాంక్షలు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**గోపాల్ పేట సీనియర్ జర్నలిస్టు జయరాం.శారద జయన్నాల కుమారుడు నిఖిల్ యాదవ్ వివాహం లక్ష్మీసిందుతో జరిగింది. జయరామ్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిరంజన్ రెడ్డివెంట బాలరాజు, వడ్డే.గోపాల్,రాజేష్ గౌడ్,పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# పదోన్నతితో మరింత బాధ్యత పెరుగుతుంది

## : రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో 10 మంది హెడ్ కానిస్టేబుల్ లకు ఏఎస్ఐ లుగా , ఇద్దరు ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ లకు ఏఆర్ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన అధికారులకు రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ వారి కార్యాలయంలో అభినందించి వారి ర్యాంక్ పదోన్నతి చిహ్నంను అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి పని చేస్తే ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, ఇప్పటివరకు ఎలాంటి క్రమశిక్షణతో విదులు నిర్వహించారో అదేవిధంగా మిగతా సర్వీస్ పూర్తి చేసి మరిన్ని పదోన్నతులు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్ , ఏఆర్ ఏ సి పి ప్రతాప్, ఆర్ ఐ మల్లేశం, రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లాకుంట పోచలింగం, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ జెడ్ పి టీ సి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి



**అగ్ని ధార న్యూస్ పానుగల్ వనపర్తి జిల్లా :** పానగల్ మాజీ జె.పి.టి.సి భాగ్యలక్ష్మి చంద్రశేఖర్ నాయక్ వదిన లక్ష్మీబాయి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారం తండాలో వారి స్వగృహానికి వెళ్ళి భర్త నానునాయకు కుమారులు మహేందర్ నాయక్,రవి నాయక్ ను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# హమాలీల కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్న హోల్ సేల్ వ్యాపారులు.

## కూలీ రేట్లు పెంచకుంటె మార్కెట్ ను స్తంభింపజేస్తాం.

### ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు మడ్డి ఎల్లా గౌడ్.




**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పని చేస్తున్న హమాలీ కార్మికుల కు కూలీ రేట్లు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సరైన విధానం కాదని, వెంటనే వారికి కూలీ రేట్లు పెంచాలని లేకుంటే కూరగాయల మార్కెట్ ను స్తంభింపజేస్తామని ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు మడ్డి ఎల్లా గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో పర్యటించి హమాలీ వర్కర్స్ తో మాట్లాడి వారి సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నలబై ఏళ్ళ కు పైగా గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో హమాలీ వర్కర్స్ పని చేస్తున్నారని, హమాలీ కార్మికులకు 2017 లో పెంచిన కూలీ రేట్లు, ఇంత వరకు పెంచకుండా హోల్ సేల్ వ్యాపారులు హమాలీలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని ఆయన అన్నారు. హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కూలీ రేట్లు పెంచాలని గత సంవత్సరం వినతి పత్రం హోల్ సేల్ వ్యాపారులకు ఇచ్చినా హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయకుండా, చర్చలు జరుపకుండ నాయకులను, హమాలీలను రైతులను ముందట పెట్టి దొంగలు గా చిత్రీకరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మార్కెట్లో హోల్ సేల్ వ్యాపారులు చేస్తున్న వ్యాపారం గురించి, రైతుల వద్ద వారు ఎలా వ్యవహరస్తున్నారో తమకు తెలుసని, కాని వ్యవహారం విషయం లో ఒక పద్దతి అనేది ఉంటుందని దాన్ని విస్మరించి హోల్ సేల్ వ్యాపారులు హమాలీ కూలీ రేట్లు పెంచమంటె పెంచకుండా ఇక్కడ కూలీ రేట్లు ఇతర ప్రాంతాల్లోని మార్కెట్ ల కన్నా ఎక్కువ ఇస్తున్నామని ప్లెక్సీ బ్యానర్ లు వేసి మార్కెట్ లో ప్రదర్శించడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. గోదావరిఖని కూరగాయల మార్కెట్ తో ఇతర మార్కెట్ లో ఉన్న కూలీ రేట్లు పోల్చవద్దని, ఎక్కడి మార్కెట్ కు కక్కడె సౌకర్యం బట్టి కూలీ రేట్లు ఉంటాయని, అది గమనించకుండా కూలీ రేట్లు పెంచేది లేదని మొండికేయడం సరైంది కాదని ఆయన హోల్ సేల్ వ్యాపారులకు సూచించారు. ఇట్టి విషయం లో కరీంనగర్ జిల్లా లేబర్ కమీషనర్ దగ్గర కు హోల్ సేల్ వ్యాపారులు వెళ్లి మేం మాట్లాడుకొని సమస్య పరిష్కారం చేస్తామని కమీషనర్ కు చెప్పి రేట్లు పెంచకుండా మోసం చేశారని ఆయన ఆరోపించారు. గత ఐదేళ్లుగా చాలిచాలని కూలీ రేట్ల తో హమాలీలు తమ కుటుంబాలను ఇబ్బందులతో పోషించుకుంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా హోల్ సేల్ వ్యాపారులు భేషజాలకు పోకుండా హమాలీలకు న్యాయంగా దక్కాల్సిన కూలీ రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో ఏఐటియుసి ఆధ్వర్యంలో మార్కెట్ ను స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు గోదావరిఖని కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్, నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానిమియా, గాలి పెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కుల సంఘ భవనం నిర్మించి ఇవ్వాలని ప్రజావాణిలో వినతి



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** నేతకాని కులస్తులకు గోదావరిఖనిలో రెండు ఎకరాల స్థలంలో నేతకాని సంక్షేమ భవనం నిర్మించి ఇవ్వాలని నేతకాని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ నేతకాని సమాజం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పదివేల మందికి పైగా ఉన్నారని, వారు ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందలేదని తెలిపారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేతకాని కులస్తులకు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ప్రజాసంఘాల ప్రతి కార్యక్రమాల్లో నేతకాని కులస్తులను కూడా భాగస్వాములు చేయాలని అన్నారు. గత ప్రభుత్వంలో కూడా నేతకానీ కులస్తులకు భవన నిర్మాణం చేపట్టాలని కోరినప్పటికీ భవన నిర్మాణం చేపట్టకుండా నేతకాని కులాన్ని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వమైనా నేతకాని కులాన్ని విస్మరించకుండా సంక్షేమ భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, నేతకాని సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులు కుమ్మరి మల్లేష్, కామెర పద్మ, దుర్గం చిన్నక్క, మాదాసు సుధాకర్, బండారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి మృతికి కారణమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి

## విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

### ప్రజా, విద్యార్థిసంఘాలు



**అగ్ని ధార న్యూస్ గోపాల్పేట వనపర్తి జిల్లా** :గోపాల్పేట మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ నందు ఏదుట్ల గ్రామానికి చెందిన భరత్ అనే విద్యార్థి మృతికి కారణమైన వార్డెన్ ను సస్పెండ్ చేసి తక్షణమే అరెస్టు చేయాలని. డిమాండ్ చేస్తూ ఎంసిఎచ్ హాస్పిటల్ ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఘాలు ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ పిడిఎస్యు పిడిఎస్యు టిఆర్ఎస్వి యువజన సంఘం డివైఎఫ్ఐ మహిళా సంఘం ఐద్వా కెవిపిఎస్ ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థి మృతి కి కారణమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని బాధ్యత కుటుం బానికి 20 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని. డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరాగం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులు పర్యవేక్షించాలని పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు పునరావతం అవుతున్నాయని వారు విమర్శించారు. ఆర్డీవో సంఘటన స్థలానికి వచ్చి హామీ మేరకు రాస్తారోకో ను విరమించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోపాలకృష్ణ.రమేష్.గణేష్. పవన్. ఆది. చంద్రశేఖర్ భగత్. మహేష్ కవిత రేణుక. బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జనవరి- 27:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

రామగుండం నగర కార్పొరేషన్ పాలకవర్గం కాలపరిమితి జనవరి 26 ,2025 న ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ పెద్దపల్లి ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా రామగుండం ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ , రామగుండం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# వెంకటస్వామి పార్థివదేహానికి నివాళులర్పించిన బిజెపి నాయకులు



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** ఆదివారం రాత్రి గుండెనొప్పితో హఠాన్మరణం చెందిన శ్రీ రంగపురం బిజెపి మాజీ మండల అధ్యక్షుడు బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు గొడుగు వెంకటస్వామి పార్థివ దేహానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు డి నారాయణ నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదారుస్తూ భారతీయ జనతా పార్టీ ఒక కరడు కట్టిన కాషాయ సైనికుని కోల్పోయిందని వెంకటస్వామి మరణం మీ కుటుంబానికి బిజెపి పార్టీకి తీర్చలేని లోటు అని మీ కుటుంబానికి భారతీయ జనతా పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది. వెంకటస్వామి కి నివాళులు అర్పించిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి అయ్యగారి ప్రభాకర్ రెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి పురుషోత్తం రెడ్డి కుమారస్వామి సీతారాములు వెంకటేశ్వర్ రెడ్డి వేమారెడ్డి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, రాజశేఖర్ గౌడ్, కదిరే మధు బాలరాజు రాఘవేందర్ గౌడ్ విష్ణువర్ధన్ బుచ్చిబాబు గౌడ్ చాణక్య తదితరులు ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి:** సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దపల్లి జిల్లా మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మధ్యాహ్న భోజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల రమేష్, హాజరై మాట్లాడుతూ..మధ్యాహ్న భోజన కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు అని హెచ్చరించారు. గత పది సంవత్సరాలుగా మార్కెట్లో కోడిగుడ్ల రేటు 6 నుండి 7 రూపాయలుగా ఉంటుంది. కానీ ప్రభుత్వం ?5 మాత్రమే చెల్లిస్తుంది అన్నారు. అనేకసార్లు అధికారులకు సమస్య వివరించిన, పట్టించుకున్న దాఖలు లేవు అలాగే, సత్యసాయి ట్రస్ట్ రాగి జావా పౌడర్ని పాఠశాలలకు అందిస్తుంది. వారికి రవాణా చార్జి కింద దాదాపుగా ఒక రూపాయి 50 పైసలు ప్రభుత్వం చెల్లిస్తుంది, కానీ ఈ జావా చేయుటకు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇలాంటి పారితోషికం కానీ వంట పాత్ర గాని గ్యాస్ కానీ ఇవ్వకుండా ఉచితంగా చేయమని వేధింపులు చేస్తున్నారు ఉన్నారు. 3000 గౌరవ వేతనంతో కార్మికులపై ముప్పెన దాడి చేస్తున్నారన్నారు. ధనిక రాష్ట్రంలో బంగారు తెలంగాణలో అగ్రగామి దేశంలో 3000 రూపాయల గౌరవ వేతనం చెప్పుకోవడానికి ఇబ్బందిగా ఉంది ఏమన్నారు. కోడి గుడ్లు ప్రభుత్వం సరఫరా చేసే వరకు నేటి నుండి కోడిగుడ్లను నిలిపివేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ కి జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. అంగన్వాడికి కేంద్రాలకు సరఫరా చేసినట్లుగానే చెయ్యాలని డిమాండ్ చేశారు. కనీసం 10,000 రూపాయల గౌరవ వేతనం ఇవ్వని పక్షంలో సమరశీల పోరాటాలకు సైతం మధ్యాహ్న భోజన కార్మికుల సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రజిత. కుల కళావతి ,నూనేటి రాధమ్మ,సుల్తాన్పూర్ రేణుక,రాజ్ కుమార్,గుమ్మడి వరలక్ష్మి,జంగం లక్ష్మి, పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు



స్వర్ణశిల్పిగోపినాథ్

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** బంగారు ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ బంగారు ధర పెరుగుతుందని వనపర్తి పట్టణంలోని స్వర్ణశిర్పిఅయిన గోపీనాథ్ జ్యువెలరీ వ్యాపారి గోపీనాథ్ సోమవారం ఆంధ్రప్రభ తో అన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలకు అనుగుణంగా బంగారం ధరలు.. ప్రస్తుత ధర 83000... ఈ సంవత్సరం 80 వేల నుంచి 90 వేల మధ్యన బంగారం ధర ఉండవచ్చు అని ఆయన అన్నారు.ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వాణిజ్య యుద్ధంసంభవిస్తుందనే ఆందోళన వ్యక్తమౌతోందని వివిధ దేశాల ఉత్పత్తులపై విధిస్తున్న సుంకం, ఆంక్షల నేపథ్యంలో దీంతోపాటు డాలర్ విలువ పెరగడం కూడా ఒక కారణం అయి ఉండవచ్చని ఈ కారణాల వల్ల ఇన్వెస్టర్లు తమ డబ్బును సురక్షితమైన పెట్టుబడి సాధనంగా భావించే బంగారం వైపు తరలిస్తున్నారు. ఫలితంగా బంగారం ధర భారీగా పెరగడం ప్రారంభించిందని గోపీనాథ్ జువెలరీ వ్యాపారి తెలిపారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేల ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

### తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన గొల్లపల్లి పిఆర్టియు-టిఎస్ నాయకులు

**గొల్లపల్లి :** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేల ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పిఆర్టియు-టిఎస్ గొల్లపల్లి మండల అధ్యక్షుడు రాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొంద్ర దేవేందర్ లు కోరారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి నేరుగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ పిఆర్టియు-టిఎస్ గొల్లపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు గొల్లపల్లి తహసిల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఆర్టియు- టిఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేని నేషనల్ పెన్షన్ స్కీమ్ లో భాగంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 1 నుండి ప్రవేశ పెట్టడల జరిగిందని భద్రత లేని ఈ సిపిఎస్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారన్నారు. దీని దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఏదో కంటితుడుపు చర్యగా కొన్ని మెరుగులు అద్ది పాత పెన్షన్ పోలి ఉండేలా చూసి తమ ఉద్యోగులకు తేది 01.04.2025 నుండి యుపిఎస్ (సమీకృత పెన్షన్ స్కీమ్)ను అమలు చేయనున్నారన్నారు. అదే విధంగా రాష్ట్రాలను ఈస్కీమ్ అమలు చేయమని కోరే అవకాశం ఉందని అన్నారు. తెలగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పి ఎఫ్ ఆర్ డి ఏ మరొక్కసారి రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు ఏ విధమైన పెన్షన్ విధానాన్ని ఎంపిక చేసుకుంటారని ఆప్షన్ కోరగా సిపిఎస్ విధానం నుండి వైదొలగటానికి అవకాశం వచ్చినప్పటికీ నాటి తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 23,2014 నాటి 28 జీవో ద్వారా సిపిఎస్ విధానాన్ని కొనసాగించి ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు జరుగుతున్న నష్టాలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ ఇటీవల అధికారంలోకి వచ్చిన రాజస్థాన్, ఛత్తీస్గఢ్, జార్ఖండ్ మరియు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విదంగా ప్రభుత్వానికి తెలియజేయాలని తహసిల్దార్ ద్వారా కోరుతున్నామన్నారు.

# పర్యాటక ప్రదేశంగా సింగూరు ప్రాజెక్టు

### మంత్రి దామోదర రాజనర్సింహ క్షేత్ర స్థాయి పర్యటన

**సంగారెడ్డి :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా, పుల్కల్ మండలం లోని సింగూరు ప్రాజెక్ట్ ను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేసారు.పర్యాటకుల సౌలభ్యం కోసం 50 సీట్ల సామర్థ్యంతో నడిచే రెండు అధునాతన బోట్లు, స్పీడ్ బోట్స్ లను ఏర్పాటు చేయాలనీ మంత్రి ఆదేశిం చారు.



# గెట్ రెడీ..

## నాగచైతన్య, సాయిపల్లవి తండేల్ ట్రైలర్ లాంచ్ ఎక్కడో తెలుసా..?

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో వస్తోన్న రొమాంటిక్ డ్రామా ప్రాజెక్ట్ తండేల్ చందూ మొండేటి డైరెక్ట్ చేస్తోన్న ఈ మూవీ ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక్కొక్క పాటలను విడుదల చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇక మూవీ లవర్స్, అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తండేల్ ట్రైలర్ అప్‌డేట్ అందించారు మేకర్స్. తండేల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్ శ్రీరామ పిక్చర్ ప్యాలెస్ (రామ టాకీస్ రోడ్) వద్ద నిర్వహించనున్నారు. జనవరి 28 సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్ ఉండబోతుందని తెలియజేశారు మేకర్స్. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.




# 'హరి హర వీరమల్లు' నుంచి బాబీ డియోల్ ఫస్ట్ లుక్ రిలీజ్

నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా రెండు పార్ట్‌లుగా రాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ శరవేగంగా షూటింగ్ కంప్లీట్ చేసుకుంటుంది. మరోవైపు ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఇక విడుదల తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి పవన్ కళ్యాణ్ పాడిన ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అనే పాటను వదిలిన చిత్రబృందం తాజాగా విలన్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్న బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ బర్త్‌డే నేడు. ఈ సందర్భంగా మూవీ నుంచి ఆయనకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలుపుతూ.. బాబీ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# బ్రిటిష్ కాలంనాటి కథ

## రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. 'వీడీ 14' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ సినిమా తాలూకు సెట్‌వర్క్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ సోషల్‌మీడియా ద్వారా స్పందిస్తూ 'పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. బ్రిటిష్ పాలన కాలం నేపథ్యంలో వచ్చిన చిత్రాల్లో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని కథాంశం. విజయ్ పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.




# ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. 'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ అప్‌డేట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కీలక పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు కుటుంబం నుంచి వస్తున్న ఈ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్‌ని ప్రకటించింది. ఈ మూవీ నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని ఫిబ్రవరి 3న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ అందుకుంది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com